# బిద్దుబాట

**వాణిశ్రీ**

రాత్రి తొమ్మిది దాటింది. చెన్నకేశవరెడ్డి అంకమ్మ గుడి దగ్గర మురికి కాలువ వంతెన మీద కూర్చుని వున్నాడు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. అప్పుడప్పుడూ ఒక స్కూటరో, సైకిలో పోతూవుంది. అంకమ్మ గుడిలో గూడా ఎవరూ లేరు. సింహద్వారానికి తాళం వేసుకుని వెళ్లిపోయాడు పూజారి. గుడి ప్రాంగణంలో తాతలనాటి రావి చెట్టు, దాన్ని పెనవేసుకుని పెరిగిన వేప చెట్టు – దూరం నుంచి చూస్తే భయం గొల్పుతూ ఉంటాయి. బాగా చీకటి పడిన తర్వాత ఆ చెట్ల నీడలో రోడ్డు మీద నడవడానికి జనం జంకుతూ వుంటారు. గుడి గోడల మీద మెడలో పుర్రెల దండ, చేతిలో ఖడ్గం పట్టుకుని, ఎర్రటి నాలుక చాచిన అంకమ్మ బొమ్మ భీతి గొల్పుతూ వుంటుంది.

అమావాస్య చీకటి. నిర్మానుష్యమైన అక్కడ వంతెన మీద కూర్చుని సిగరెట్ తాగుతున్న చెన్నకేశవరెడ్డి మనసులో ఆందోళన చెలరేగుతూ వుంది. మాటిమాటికి చేతి గడియారం చూసుకుంటున్నాడు. అతని వాలకం చూస్తే ఎవరి కోసమో నిరీక్షిస్తున్నట్లుంది.

దూరం నుంచి స్కూటర్ వస్తోంది. హెడ్‌లైట్ ఫోకస్ చెన్నకేశవరెడ్డి ముఖం మీద నేరుగా పడుతోంది. వెలుగు భరించలేక కళ్లుమూతలు పడ్డాయి. ముఖానికి చేతులు అడ్డం పెట్టుకుని "ఎవర్రా అది?" అన్నాడు గట్టిగా. అతనికి కోపం వచ్చింది. రోడ్డు మీద పోయే వాడు పోకుండా తన మీదకు లైట్ ఫోకస్ చేయడం ఏమిటి?

స్కూటర్ వంతెన దగ్గర ఆగింది.

"ఏంది రెడ్డీ! ఈ యాళప్పుడు ఇక్కడ కూర్చున్నావ్?" అడిగాడు శంకరయ్య స్కూటర్ మీద నుంచే.

"నువ్వా! శంకరయ్యా! ఎవడో అనుకున్నా!" నవ్వాడు చెన్నకేశవరెడ్డి.

"నేనే. వేరే ఎవరైనా నీ ముఖం మీద లైటింగేస్తే వూరుకుంటావా? పీక పట్టుకోవూ!" అన్నాడు శంకరయ్య.

"యాడనుంచొస్తున్నావు?" అడిగాడు చెన్నకేశవరెడ్డి.

"మా ఆవిడ పుట్టింటికి వెళ్లిందిలే! ఇంటికెళ్లి ఏం చెయ్యాలని ఫస్ట్‌షో సినిమా కెళ్లొస్తున్నా!"

"అదన్నమాట సంగతి. పెళ్లాం వూరెళ్తే సినిమాలు, షికార్లు..." అని నవ్వాడు చెన్నకేశవరెడ్డి.

"అంతేగా మరి? నువ్వేంది యాడ చీకట్లో?"

"ఏం లేదులే!"

"మా ఇంటి కెళ్దాంరా! మందు కొడదాం. పోతా పోతా బిర్యానీ పేకెట్లు తీసుకుపోదాం" అన్నాడు శంకరయ్య.

మందు, బిర్యానీ మాట వినగానే చెన్నకేశవరెడ్డి నోట్లో నీళ్లూరాయి. వాచీలో టైము చూసుకుని "వీడింక దొరికేట్టు లేడు. పద..." అని వంతెన మీద నుంచి లేచి వచ్చి స్కూటర్ ఎక్కాడు.

"ఎవడు వాడు?"

"చెప్తాలే పద"

శంకరయ్య స్కూటర్ స్టార్ట్ చేసాడు.

* * *

శంకరయ్య ఇంట్లో మందు కార్యక్రమం మొదలైంది. మూడో రౌండ్లోకి వచ్చాక "అంకమ్మ గుడి దగ్గర ఎందుకు కూచ్చున్నానో తెలుసా? గుడుంబా సాంబయ్య కోసం" మొదలుపెట్టాడు చెన్నకేశవరెడ్డి.

"గుడుంబా సాంబయ్య కోసమా? వాడితో నీకేం పని?" ఆశ్చర్యపోతూ అడిగాడు శంకరయ్య.

"నువ్వు నా క్లోజ్ ఫ్రెండ్‌వి. నీ దగ్గర దాపరికం ఏందిగాని, నిజం చెప్తున్నా... అంకమ్మ తల్లిమీద ఒట్టు. నాగరత్నాన్ని సఫా చేయించాలనుకుంటున్నా!" సీరియస్‌గా అన్నాడు చెన్నకేశవరెడ్డి.

"నాగరత్నమా...?"

"అదేనోయ్! మా నాన్న వుంచుకున్నావిడ."

"అర్థమైందిలే" అన్నాడు శంకరయ్య విస్కీగ్లాసెత్తి సిప్‌చేస్తూ.

"అది చస్తేగాని పీడాపోదు" కసిగా అన్నాడు చెన్నకేశవరెడ్డి.

"నాగరత్నం ఏం చేసింది?" అడిగాడు శంకరయ్య.

"మా నాన్న కర్మరోజు నువ్వొచ్చావుగా?"

"ఆ..."

"అప్పుడే సుబ్బరావయ్య మధ్యవర్తిగా వచ్చాడు. నువ్వు చూసేవుంటావు అతగాడిని. నీరుకావి పంచె, చొక్కాతో వుంటాడెప్పుడూ!"

"సుబ్బరావయ్య నాకెందుకు తెలీదూ! కౌన్సిలర్‌గా గూడా చేసాడు. పెద్ద లిటిగెంట్‌లే...!"


"ఆ... నాగరత్నం సంగతేమిటని అడిగాడు. మీ నాన్నని నమ్ముకుని ఇరవై ఏళ్ల నుంచి వుంది. ఆవిడకి ఇద్దరు పిల్లలు. కొడుకు చదువు మధ్యలో వున్నాడు. కూతురు పెళ్లి చెయ్యాలి. ఆవిడ జీవనం... అని మొదలెట్టాడు. ఆయన బతికినన్నాళ్లూ పీక్కుతిన్నది ఇప్పుడింకేం ఇయ్యాల? అని మా అమ్మ తిట్టింది. చిల్లి గవ్వగూడా ఇచ్చేది లేదని మా మేనమామలు తెగేసి చెప్పేసారు. అదెట్లా కుదురిద్దిలే... మళ్లీ కూచుందామని చెప్పి పోయాడు సుబ్బరావయ్య".

"మళ్లీ వచ్చాడా?" అడిగాడు శంకరయ్య.

"రాలేదు గాని ఏదో గూడుపుఠాణీ చేస్తున్నాడు. నాగరత్నానికి పిల్లోడు పుట్టినప్పుడు ఆసుపత్రిలో పిల్లలు పుట్టకుండా మా నాన్నే సంతకం పెట్టి ఆపరేషన్ చేయించాడంట. పిల్లల్ని స్కూల్లో చేర్పించినప్పుడు తనే తండ్రినని మానాన్న సంతకాలు చేసాడట. అవన్నీ బైటకు తీయిస్తున్నారని తెలిసింది".

"అంతేమరి. వాళ్ల ప్రయత్నాలు వాళ్లు చేసుకుంటారు గదా?" అన్నాడు శంకరయ్య.

"ఆస్తిలో భాగం రావాలని కోర్టులో కేసు ఏస్తున్నా



రని తెలిసింది".

"రాజీ కుదరకపోతే ఎవరైనా అంతే?"

"వుంచుకున్నదానికి ఆస్తిలో హక్కు వుంటుందా? తిరపతిరెడ్డి పెళ్లిచేసుకోలేదుగా! ఇచ్చేదేం లేదంటు న్నారు మా వాళ్లంతా".

"మీవాళ్లట్లాగే అంటార్లే!"

"ఏంది శంకరయ్యా! నువ్వుగూడా అట్టా మాట్లా డతావేంది? మా వాళ్లనేది నిజమేగా! ఉంచుకున్న దానికి ఆస్తిలో హక్కుంటుందా?"

"ఏంది రెడ్డి! అంత కోపం? నేనేవన్నాను. మీ వాళ్లు నిన్ను సపోర్టు చేస్తారు. మామూలే. కాని రేపు నాగరత్నం కోర్టులో కేసు వేస్తే తిరిగేది నువ్వు. ఆవిడకు కూడా భాగం ఇవ్వాలని తీర్పు వస్తే పంచి ఇవ్వాల్సింది నువ్వు. మాటలకేం నేనూ చెప్తాను" అన్నాడు శంకరయ్య.

"సర్లేగాని. ఉంచుకున్నదానికి ఆస్తిలో భాగం ఇవ్వమని కోర్టు తీర్పు ఎట్లా యిస్తది?"

"ఉంచుకున్నదని మీరు అంటున్నారు. నాకు ఫలానా గుడిలో పుస్తె కట్టాడు. నేను రెండో పెళ్లాన్ని అని నాగరత్నం సాక్ష్యాలు ప్రవేశపెడుతుంది. అంతే గానీ నేను తిరపతిరెడ్డి వుంపుడుకత్తెనని కోర్టులో ఒప్పుకుంటుందా?" నవ్వాడు శంకరయ్య.

"అట్లాంటి మెలికలేవో పెడతాడు సుబ్బరామ య్య. నాకు తెలుసు. అందుకే నాగరత్నాన్ని, దాని పిల్లల్ని చావగొట్టించాలని నిర్ణయించుకున్నా! గుడం బా సాంబయ్యకి అప్పజెప్తే మొత్తానికి సఫా చేస్తాడు. పీడా విరగడైపోద్ది" కసిగా అన్నాడు చెన్నకేశవరెడ్డి.

పకపక నవ్వాడు శంకరయ్య.

"ఏందబ్బా అట్లా నవ్వుతావు?" చిరాకుగా అన్నా డు చెన్నకేశవరెడ్డి గ్లాసు పైకెత్తి విస్కీ ఖాళీ చేస్తూ.

"నవ్వక ఏడవమంటావా రెడ్డీ! నువ్వింత తెలివి తక్కువోడివనుకోలేదు" అన్నాడు శంకరయ్య.

తెల్లబోయి చూసాడు చెన్నకేశవరెడ్డి.

"క్రైమ్ నెవ్వర్ పేస్ అన్నారు. నిజం నిప్పులాం టిది అని కూడా అన్నారు. గుడుంబా సాంబయ్యతో నాగరత్నాన్ని, ఆమె పిల్లల్ని చంపిస్తావు. బాగానే వుంది. పీడా విరగడైందని నువ్వు హాయిగా నిద్ర పోతావు. ఎన్నాళ్లు? హత్యకేసు అంత తేలిగ్గా కొట్టే స్తారా పోలీసులు? నాగరత్నాన్ని ఆమె పిల్లల్ని చంప డానికి కారణం ఏమిటి? వాళ్లకి శత్రువులు ఎవరు? వాళ్లు చావడం వలన ఎవరికి లాభం? అని కూపీ లాగుతారు. పర్‌ఫెక్ట్‌గా హత్యచేసిన వాడెవడూ ఈ లోకంలో పుట్టలేదు. ఏదొక పొరపాటు చేస్తాడు. అది హంతకుడిని పట్టిస్తుంది. అట్లా గుడుంబా సాం బయ్య దొరికిపోతాడు. నాగరత్నం మీద సానుభూ తి చూపించే వాళ్లూ వుంటారు. అన్ని వేళ్లూ మీ మీద అనుమానం చూపిస్తాయి. ఫలితం ఏమిటం టే నువ్వు, మీ అమ్మ, మేనమామలు జైలుకి వెళ్తారు" చెప్పాడు శంకరయ్య.

చెన్నకేశవరెడ్డి వులిక్కిపడ్డాడు. శంకరయ్య మాట లకి తల తిరిగినట్లయింది. మత్తంతా దిగిపోయింది. అయోమయంగా చూసాడు.

అతను ఆలోచనలో పడిపోయాడని గ్రహించిన శంకరయ్య "నాగరత్నం చేసిన తప్పేంటి?" అని ప్రశ్నించాడు.

"మా నాన్నకి పెళ్లయింది, పిల్లలున్నారు. అటు వంటి వాడిని లోబరుచుకోవడం తప్పుకాదా? ఇరవై ఏళ్లపాటు తనను, తన పిల్లల్ని పోషించాడు. తృప్తి లేదా? చచ్చిపోయాడిక. మమ్మల్ని వదిలేయకుండా ఆస్తిలో వాటాకావాలని పీడించడం ఏమిటి?" ఆవే శంగా అన్నాడు చెన్నకేశవరెడ్డి.

"ఆవిడే మీ నాన్నని లోబరుచుకుందని నీకేం తెలుసు? భర్త పోయిన ఆడది. పిల్లా జల్లా లేని ఒంటరిది. అందంగా వుంది. కోడె వయసులో వుందని మీ నాన్నే ఆవిడ్ని ట్రాప్ చేసి, మాయ మాటలు చెప్పి లొంగదీసుకొని వుండొచ్చుగా? మీ నాన్న తప్పు ఏం లేదా?" అన్నాడు శంకరయ్య.

"మా నాన్న మగాడు..." ఏదో చెప్పబోతున్న చెన్నకేశవరెడ్డిని అడ్డుకుని "రెడ్డీ! మగాడ్ని అని అహం కారంతో ఏం చేసినా చెల్లే రోజులు పోయాయి. రేపు కోర్టులో నాగరత్నం పిల్లలు మా నాన్నకు పుట్ట లేదు, ఆవిడ తిరుగుబోతు అని మీరు వాదించొచ్చు. కాని ఇప్పుడు రక్తసంబంధాన్ని తేల్చే డి.యన్.ఎ. టెస్ట్‌లు వచ్చాయి. మీ నాన్న ద్వారానే ఆవిడకు పిల్లలు

పుట్టారనే సత్యాన్ని తేలుస్తాయి" అన్నాడు శంకరయ్య.

"ఏమో! నాగరత్నం వ్యవహారం మాకు నచ్చడం లేదు. ఆస్తిలో భాగం ఇచ్చేది లేదు."

రెడ్డీ! ఎంతసేపూ నువ్వు మీ వైపు నుంచే ఆలోచిస్తున్నావు. నాగరత్నం వైపు నుంచి గూడా ఆలోచించు. ఇరవై ఏళ్లు మీ నాన్న ప్రాపకంలో వుంది. ఆవిడ్ని భార్యగా భావించాడు. పోషించాడు. పిల్లల బాధ్యత తీసుకున్నాడు. హఠాత్తుగా పోయాడు. ఇక తను ఎలా బతుకుతుంది? పిల్లల పరిస్థితి ఏమిటి? వాళ్ల భవిష్యత్తు ఏమిటనే ఆందోళన సహజంగదా?"

చెన్నకేశవరెడ్డి కొంచెం సేపు మౌనంగా వుండి పోయాడు. గ్లాసులోకి విస్కీ వంచుకోబోతుంటే శంకరయ్య అడ్డుపడ్డాడు.

"రెడ్డీ! ఇక తాగడం వద్దులే. ఓవరైంది. బిర్యానీ తిందాం" అన్నాడు.

"ఇదే లాస్ట్ రౌండ్..." అంటూ గ్లాసులోకి విస్కీ వంచుకున్నాడు చెన్నకేశవరెడ్డి.

కాసేపైన తర్వాత ఇద్దరూ బిర్యానీ తిన్నారు. తిన్నంత సేపూ ఏమీ మాటలు జరగలేదు. చెన్నకేశవరెడ్డి వాచీ చూసాడు. పదకొండు దాటింది.

"ఇక ఇంటికి పోతానోయ్!" అని లేచాడు చెన్నకేశవరెడ్డి.

"ఇంత రాత్రివేళ ఇంటికేం పోతావులేవోయ్! ఇక్కడ పడుకుని పొద్దునే పోదువుగానిలే! మందు గూడా ఎక్కువే తాగావు. అంత దూరం తూలుకుంటూ ఏం పోతావు?" అన్నాడు శంకరయ్య.

"మా ఆవిడ గొడవ చేస్తుంది. ఇప్పుడే వస్తానని అన్నం గూడా తిని రాలేదు. నా కోసం ఎదురు చూస్తుంటుందేమో?

"ఈ రాత్రికి రానని ఫోన్ చెయ్యి."

"ఎందుకూ? నన్ను స్కూటర్ మీద డ్రాప్ చెయ్యరాదూ?"

"తాగి స్కూటర్ నడపడం ఎందుకు? రోజులన్నీ మనవి కాదు. ఏదైనా యాక్సిడెంట్ జరిగితే, తాగి డ్రైవ్ చేసాడని కేసవుతుంది. పరువుపోతుంది. ఎందుకొచ్చిన గొడవ?" అన్నాడు శంకరయ్య.

చెన్నకేశవరెడ్డి టెలిఫోన్ దగ్గరకెళ్లి రిసీవర్ ఎత్తి ఇంటికి ఫోన్ చేసాడు.

* * *

మర్నాడు ఉదయం చెన్నకేశవరెడ్డి నిద్రలేచేసరికి శంకరయ్య వంటగదిలో వున్నాడు.

"ఏంది రెడ్డీ రాత్రంతా మెసల్తానే వున్నావే! కొత్త చోటు కాబట్టి నిద్రపట్టి వుండదు" అన్నాడు శంకరయ్య కాఫీ కప్పు అందిస్తూ.

"అదేం కాదుగాని సరిగా నిద్రపట్టలా... నువ్వు అన్న మాటలన్నీ చెవుల్లో మోగుతూ వుండాయబ్బా! ఒకటే ఆలోచన్లు. నువ్వన్నట్లే హత్యకేసులు ఎట్లాగో బైటపడక తప్పదనిపిస్తా వుంది. ఎందుకొచ్చిన గొడవ? ఆ నాగరత్నం మొఖాన ఇంత పారేస్తే పోతుంది గదా! అని అనిపిస్తావుంది" అన్నాడు చెన్నకేశవరెడ్డి.

"నేను మొత్తుకున్నది అదేగదా రెడ్డీ! ఎంతైనా మీ నాన్నకి పుట్టిన పిల్లలు. రక్తసంబంధం గదా! వాళ్లూ బాగుండాలని కోరుకోవాలి గాని మర్డర్ చేయించాలనే ఆలోచన తప్పుగాదా?"

చెన్నకేశవరెడ్డి సాలోచనగా తలవూపాడు.

"నాగరత్నం మీ ఆస్తిలో వాటా ఏం కోరడం లేదు. బతకడానికి దారి చూపిస్తే చాలు. పిల్లలు ఎట్లాగో గట్టెక్కితే సంతోషిస్తుంది. ఇందులో మీకు పోయేది ఏంది రెడ్డీ! మీకు వ్యాపారం వుంది. ఆస్తులున్నాయి. కోటికి పడగలెత్తారు. అందులో ఇంత తీసిస్తే మీకేం లెక్కలోది కాదు. ఉప్పు, పప్పు కింద లెక్క" అన్నాడు శంకరయ్య.

"సర్లే శంకరయ్యా! నువ్వు మంచిమాటే చెప్పావు. కేసుల్లో ఇరుక్కుని డబ్బు తగలేసే దానికంటే, నాగరత్నం మొఖాన ఇంత కొడితే గొడవ వదిలిపోతుంది. నువ్వొక పనిచెయ్యి. సాయంకాలం ఆ సుబ్బరావయ్యని పిల్చుకుని మా ఇంటికి రా! నాగరత్నానికి ఏం చేస్తే బాగుంటుందో అడిగి సెటిల్ చేద్దాం. నేనీ లోపల మా అమ్మకి నచ్చజెప్తాను. ఏమంటావు?" అన్నాడు చెన్నకేశవరెడ్డి.

"శభాష్ రెడ్డీ! అట్లాగే చేద్దాం. నేను సుబ్బరావయ్యను తీసుకుని మీ ఇంటికి వస్తాను" అని శంకరయ్య స్నేహితుణ్ణి మెచ్చుకున్నాడు. ●